క్లుప్తంగా

కార్మికులపై ప్రభుత్వ వైఖరి దారుణం



సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: కూటమి ప్రభుత్వం కార్మికులపై అన్యాయంగా వ్యవహరిస్తుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ విమర్శించారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మొగల్తూరు మండలంలోని గాంధీ బొమ్మ సెంటర్లో ఆ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో కార్మిక చట్టాల సవరణ బిల్లును తీసుకురావడమే కాకుండా 10 గంటలకు పైగా కార్మికులు పని చేయాలని దారుణమన్నారు. వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కంచర్ల సోనీ ఇంట్లో కొత్తపల్లి గోవిందరాజులు అడ్డాల ఏడుకొండలు, చిలకపూడి నాగేశ్వరరావు, కడలి ముత్యాలరావు, బేబీ రాణి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆరోగ్య పరీక్షలు



శిరగాలపల్లిలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న మేడపాడు పీహెచ్‌సీ వైద్యాధికారులు

యలమంచిలి: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మేడపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శిరగాలపల్లిలో గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ పి.నరేష్‌కుమార్ మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య పరీక్షలు చేశారు. శిబిరాన్ని సర్పంచ్ పైడి చంద్రపాల్ ప్రారంభించారు. శిబిర నిర్వహణకు సొసైటీ చైర్మన్ చిలుకూరి బాలాజీ, తమ్మినీడి సీతారాముడు, గ్రామ కార్యదర్శి పీతల రాజశేఖర్ సహకరించారు. శిబిరంలో వైద్య సిబ్బంది రత్నకుమారి, మురుకుర్తి శివకుమార్, కనకదుర్గ, సావిత్రి సేవలందించారు.

తాగునీటి పైప్‌లైన్లకు మరమ్మతులు

పెనుగొండ: పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫర పైపులైన్ల మరమ్మతులను పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలా సోనీ శాస్త్రి పర్యవేక్షించారు. మంగళవారం శివారు ప్రాంతాల కాలనీలకు తాగునీటి సరఫరాను అధికారులతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సూర్యప్రకాశ రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిరియాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

29 నుంచి షటిల్ టోర్నమెంట్

ఉండి: దసరా పర్వదినాలను పురస్కరించుకుని ఉండిలోని కలిదిండి రామచంద్రరాజు జన్మభూమి పార్క్‌లో ఈ నెల 29 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు నియోజకవర్గస్థాయి షటిల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ పోటీలు ఓపెన్ ప్లేయర్స్, 30 ప్లస్, 40 ప్లస్ ఇలా మూడు విభాగాలుగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 29న ఓపెన్ ప్లేయర్స్, 30న 30 ప్లస్ ప్లేయర్స్, సెప్టెంబర్ 1న 40 ప్లస్ ప్లేయర్స్‌కు పోటీలు నిర్వహిస్తున్నాని వివరించారు. వీటిలో ఫైనల్స్‌కు చేరిన వారికి 2న ఫైనల్స్ నిర్వహించి బహుమతులు అందజేస్తామని వివరించారు. ప్రతి విభాగంలోనూ మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు చొప్పున అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 28లోపు ఎంట్రీలు నమోదు చేసుకోవాలని సూచించారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు, ఓటరు కార్డును తీసుకు రావాలని సూచించారు.ఈ పోటీల్లో నాన్ మెడలిస్టు క్రీడాకారులు మాత్రమే పాల్గొనేందుకు అవకాశం ఉందని ఈ విషయాన్ని గమనించాలని నిర్వాహకులు కోరారు.

పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లపై సమీక్ష

తణుకు అర్బన్: కళాశాల విద్యార్థుల పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి యంత్రాంగం కలిసికట్టుగా పనిచేసి త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారి ఎన్‌వీ అరుణకుమారి అన్నారు. తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. స్కాలర్‌షిప్‌కు సంబంధించి విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్ చేసే విధానంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 5 స్టెప్ వెరిఫికేషన్‌లో అంచెలంచెలుగా పర్యవేక్షణ ఉండాలని, సచివాలయ వెల్ఫేర్ ఆఫీసర్స్ నుంచి కళాశాలల ప్రిన్సిపాల్స్ ఇతర అధికారులు సైతం పూర్తి స్థాయిలో కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తణుకు డివిజన్ సహాయ సాంఘిక సంక్షేమాధికారి పీవీడీ ప్రసాద్, ఆచంట, పెనుమంట్ర, పెనుగొండ, తణుకు అర్బన్, రూరల్, ఇరగవరం మండలాలకు సంబంధించిన కళాశాలల ప్రిన్సిపాల్స్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంతమార్కెట్‌లో సమస్యల తిష్ట

- అధ్వానంగా మారిన పరిసరాలు
- డ్రెయిన్ల సమస్యతో సతమతం

పెనుగొండ: చుట్టుపక్కల గ్రామాలకు కూడలిగా ఉండి జిల్లాలోనే అతి పెద్ద సంతగా ఉండే పెనుగొండ సంత పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. పూర్వ వైభవాన్ని కోల్పోయిన సంత మార్కెట్‌లో సమస్యలకు పరిష్కారం ఎప్పుడో అంటూ వ్యాపారులు ఎదురుచూస్తున్నారు. వందలాది దుకాణాలతో వేలాది మంది ప్రజలతో ప్రతి బుధవారం సంత కలకలలాడుతూ ఉండేది. పశువుల సంత సైతం అతి పెద్దది కావడంతో తెల్లవారు జాము నుంచి మధ్యాహ్నం వరకూ పాడి పశువులు, ఎద్దులతో నిండి ఉంటుంది. అయితే తొలుత పశువుల సంతను సంత మార్కెట్ నుంచి మార్కెటింగ్ యార్డుకు తరలించారు. ఆనాటి నుంచి సంత వైభవం తగ్గుతూ వచ్చింది. చివరకు పశువుల సంత మాయమైంది. కేవలం కూరగాయలు, ఎండు చేపలు, మాంసాహార దుకాణాలు, పప్పు ధాన్యాలు, ఇతర దుకాణాలతో కళకళలాడుతూ ఉండేది. సంత మార్కెట్‌లో షెడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరడం, చిన్నపాటి వర్షం కురిస్తే చాలు చిత్తడిచిత్తడిగా మారుతుండడంతో పాటు నిత్య దుకాణాలు రావడంతో రానురాను పెనుగొండ సంతకు వైభవం తగ్గిపోయింది.

మౌలిక సదుపాయాలు కరువు

సంత మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు పూర్తిగా మృగ్యమైపోవడంతో 2014–18 సంవత్సరంలో సంతమార్కెట్ అభివృద్ధికి 2020లో అప్పటి మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ప్రతిపాదనలు చేశారు. అధునాతన సంతమార్కెట్‌గా తీర్చిదిద్దాలని ప్రయత్నం చేశారు. అయితే కరోనా రావడంతో ప్రతిపాదనలు ముందుకు సాగలేదు. దీంతో సంత మార్కెట్ పూర్తిగా శిథిలమైంది. దీనికి తోడు డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. చేపలు, మాంసం వ్యర్థాలు బయటకు వెళ్లే అవకాశం లేకపోవడం దుర్వాసన వెదజల్లుతుంది. బుధవారం, నిత్యం జరిగే దుకాణాల నుంచి వచ్చిన వ్యర్థాలతో దుర్వాసనలు సమీప దుకాణదారులూ ఇబ్బందులు పాలవుతున్నారు. దీంతో సంతలో దుకాణాలు వేయలేని పరిస్థితులతో రోడ్డుపైనే దుకాణాలు నిర్వహిస్తూ సంతకానిచ్చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పెనుగొండ సంతమార్కెట్‌కు పూర్వ వైభవం తీసుకురావడానికి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని పెనుగొండ వాసులు కోరుతున్నారు.



పెనుగొండ సంత మార్కెట్



సంతమార్కెట్‌లో డ్రెయిన్ల దుస్థితి



సంత మార్కెట్‌లో శిథిలావస్థకు చేరిన షెడ్లు

పేదలకు ఇళ్లు కట్టాలి



సభలో మాట్లాడుతున్న జేఎన్‌వీ గోపాలన్

నరసాపురం: ఇళ్లు లేని పేదలకు స్థలం కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మీరా భవనంలో మంగళవారం సీపీఎం అఖిలభారత మాజీ కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు అధ్యక్షతన నిర్వహించిన సభలో గోపాలన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంమ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు గాలికొదిలేసిందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కవురు పెద్దరాజు, మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్ మండల కమిటీ సభ్యులు తెలగంశెట్టి సత్యనారాయణ, కడలి రవి, బుడిద జోగేశ్వరరావు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: కమ్యూనిస్ట్ యోధుడు సీతారాం ఏచూరి ఆశయ సాధన కోసం పని చేయడమే ఆయనకు ఘనమైన నివాళి అని సీపీఎం రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మంతెన సీతారాం అన్నారు. మంగళవారం స్థానిక మహిళా భవనంలో ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జవ్వాది శ్రీనివాసరావు, కానేటి బాలరాజు, డి.జయప్రభ తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో సచివాలయ ఉద్యోగుల నిరసన

యలమంచిలి: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సచివాలయ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో ప్లకార్డులు చేతితో పట్టుకుని నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను తీర్చాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు షేక్ ఉమర్ ఆలీష మాట్లాడుతూ ప్రభుత్వం యూనియన్ నాయకులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని చెప్పారు. ఈ నెల 25 వరకు నల్ల బ్యాడ్జీలతో నిరసన, 26న మధ్యాహ్న భోజన విరామ సమయంలో మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల వద్ద నిరసన, 27న గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాల సమర్పణ, 28న విశాఖపట్నంలో ప్రాంతీయ సభ నిర్వహిస్తామన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని సచివాలయ ఉద్యోగులు తెలిపారు.



ఆర్యపేట సచివాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

ఆయుర్వేద వైద్య విధానంపై అవగాహన

పాలకొల్లు సెంట్రల్: ఆయుర్వేదం భారతీయప్రాచీన వైద్య విధానం మాత్రమే కాకుండా ప్రకృతిని కాపాడే సమగ్ర జీవన విధానమని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.యామిని అన్నారు. మంగళవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయుర్వేద వైద్య విధానంపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ యామిని మాట్లాడుతూ యువత ఆయుర్వేదంపై అవగాహన పెంచుకోవాలన్నారు. తద్వారా పర్యావరణ పరిరక్షణలో కూడా సహకరిస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలతో పాటు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయుర్వేద మూలికల ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, అధ్యాపకులు డాక్టర్ ఎం.రామకృష్ణ, డాక్టర్ బూసి వెంకటస్వామి, పి.శ్రీనివాసరావు, వి.శిరీష, కె.శివకృష్ణ, బి.రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ యామిని

ప్రయాణికుల బస్ షెల్టర్ కూల్చివేత



మార్టేరులో వర్షానికి షెల్టర్ కింద చేరిన ద్విచక్రవాహన ప్రయాణికులు (ఫైల్)



విశ్రాంతి షెల్టర్ తొలగించిన దృశ్యం

పెనుమంట్ర: మార్టేరులోని పాలకొల్లు రోడ్డులో శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయ సమీపంలోని జెడ్ వంతెన వద్ద శ్రీ వరసిద్ధి వినాయక, శ్రీ భక్తాంజనేయ ఆలయ కమిటీ రూ.3 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రయాణికుల విశ్రాంతి షెడ్డును ఆలయ కమిటీ సభ్యులే మంగళవారం కూల్చి వేశారు. వివరాల ప్రకారం జెడ్ వంతెన వద్ద ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ కు చెందిన పోరంబోకు స్థలంలో చాలా కాలం క్రితం నిర్మించిన శ్రీ వరసిద్ధి వినాయక, భక్తాంజనేయ స్వామి ఆలయాలు ఉన్నాయి. ఇక్కడ ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ కూడా అనుమతి ఇచ్చింది. మార్టేరులోని జగన్నాథపురం, జగనన్న కాలనీ, శివరావుపేట, పెద్దపేట ప్రయాణికులకు ఈ బస్సు సెంటర్ దగ్గర దారి కావడంతో ఇక్కడి నుంచే ఈ ప్రాంత వాసులు ప్రయాణిస్తూ ఉంటారు. ఇక్కడ సరైన షెల్టర్ ఏది లేకపోవడంతో ఎండకు ఎండి, వానకు తడిసి ఇబ్బందిపడుతూ ప్రయాణం చేయాల్సి వస్తుంది. అది గమనించిన ఆలయ కమిటీ సభ్యులు సీసీ రోడ్డు నిర్మాణం అనంతరం ఆలయం పక్కనే దాతల సహకారంతో 50 రోజుల క్రితం విశ్రాంతి షెల్టర్‌ను నిర్మించారు దీంతో ఈ షెడ్‌లో ఆర్టీసీ విశ్రాంతి కుర్చీలను కూడా ఏర్పాటు చేసింది. అయితే ఇవి అక్రమ కట్టడాలు వాటిని వెంటనే తొలగించాలి అంటూ ఈనెల 12న తణుకు ఆర్అండ్‌బీ అధికారులు, 13న పాలకొల్లు ఇరిగేషన్ అధికారులు మార్టేరు గ్రామపంచాయతీ అధికారులకు నోటీసులు జారీ చేశారు. దీంతో పంచాయతీ అధికారులు ఈ నెల 14న ఆలయ కమిటీ సభ్యులకు నిర్మాణం తొలగించాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. దీంతో గత్యంతరం లేని పరిస్థితిలో ఎట్టకేలకు షెల్టర్ తొలగించాల్సి వచ్చిందని ఆలయ కమిటీ సభ్యుడు వెలగల నారాయణరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఈ తొలగింపు రాజకీయ కారణాలతోనే జరిగిందని ప్రజలు చెప్పుకోవడం గమనార్హం.

కరుణించమ్మా.. కనకదుర్గమ్మా



పాలకొల్లు సెంట్రల్: ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో అన్నపూర్ణాదేవి



పాలకొల్లు సెంట్రల్: క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో గాయత్రీదేవి

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు సందర్భంగా అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. లక్ష్మీపార్వతి అమ్మవార్లకు బోనగిరి శివరామయ్య, సూర్యనారాయణ, శివరామ ప్రసాద్, ధనుంజయ కుమార్ దంపతులు లక్ష కుంకుమ పూజలు చేశారు. సోమవారం సప్తసోమవార ప్రదక్షిణల్లో భాగంగా ఏడు వారాలు పూర్తయిన 57 మంది భక్తులు శివసహస్రనామ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అభిషేక పండిట్ భమిడపాటి వెంకన్న, మద్దూరి సూరిబాబు, ఆలయ ప్రధానార్చకులు కిష్టప్పల బ్రహ్మత్వంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక యడ్లబజారు సెంటర్‌లో కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి ఉదయం నుండి భక్తులు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం దాతల సహకారంతో ఏర్పాటుచేసిన ప్రసాద వితరణ చేశారు. స్థానిక బంగారు వారి చెరువుగట్టున ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి భవానీలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ మీసాల రాము, ఈవో ముచ్చర్ల శ్రీనివాస రావు, ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు పట్టణంలో ఘనంగా జరుగుతున్నాయి. పట్టణంలోని వివిధ ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన మండపాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండ్ల మార్కెట్ వద్ద 41వ దేవీ శరన్నవరాత్రి వార్షికోత్సవాల్లో భాగంగా అమ్మవారిని బ్రహ్మచారిణీదేవిగా అలంకరించారు. ఉత్సవ కమిటి సభ్యులు మండెల సత్యనారాయణ, గునిశెట్టి సత్యనారాయణ, ఏర్పాట్లు పర్యవేక్షించారు. రాయిపేట పుంతలోముసలమ్మ ఆలయం వద్ద, గడ్డిబజార్ కనకదుర్గ ఆలయం వద్ద ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వీవర్స్‌కాలనీలో అమ్మవారి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి.



నరసాపురం: పండ్ల మార్కెట్ వద్ద బ్రహ్మచారిణీదేవిగా దర్శనిమిస్తున్న దుర్గమ్మ

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: దసరాఉత్సవాల్లో భాగంగా మంగళవారం వేములదీవి వెస్ట్ గ్రామం కాపులకొడప సెంటర్‌లో ఏర్పాటుచేసిన దుర్గమ్మ అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించారు. పితాని మెరకలోని జాజులమ్మ ఆలయంలో ఉత్సవ కమిటీ సభ్యులు అట్టహాసంగా నవరాత్రుల వేడుకలను జరుపుతున్నారు. చినమైనవానిలంక, తూర్పుతాళ్ల గ్రామాల్లోని దుర్గమ్మ ఆలయాల్లో భక్తుల తాకిడితో రద్దీ నెలకొంది. సారవ గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొప్పర్రులో వైఎస్సార్ సీపీ నాయకుడు పోలిశెట్టి గోపీనాద్ ఇంటివద్ద ఏర్పాటు చేసిన మండపం వద్ద అమ్మవారికి గ్రామానికి చెందిన పలువురు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పెనుగొండ: గాయత్రీదేవిగా వాసవీ శాంతి ధాంలో మరకత శిల వాసవీ మాత

యలమంచిలిలో..

యలమంచిలి: దసర శరన్నవరాత్ర ఉత్సవాలు గ్రామాలలో ఘనంగా జరుగుతున్నాయి. యలమంచిలి గ్రామ దేవత శ్రీ పుంతల ముసలమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో విజయదశమి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్ర ఉత్సవాలు ఘనంగా చేస్తున్నారు. అర్చకులు గుత్తిన నరసింహమూర్తి (బాబ్జి) బ్రహ్మత్వంలో గ్రామానికి చెందిన మహిళలు మంగళవారం సామూహిక విఘ్నేశ్వరుని పూజ, కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలను తిలకించారు. భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

పెనుగొండలో...

పెనుగొండ: శరన్నవ రాత్రులు రెండో రోజు మంగళవారం ప్రధాన ఆలయాల్లోనూ, చలువ పందిళ్లలోనూ అమ్మవార్లు రాజరాజేశ్వరిగా దేవిగా పూజలందుకున్నారు. పెనుగొండ శ్రీ నగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహిషాసురమర్ధనీ, వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవార్లను రాజరాజేశ్వరిగా అలంకరించారు. అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాసవీ శాంతి ధాంలో మరకత శిల వాసవీ మాతను గాయత్రీ దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. రెండవ రోజు ఆలయాల్లో అమ్మవార్లకు కుంకుమార్చనలు, సహస్ర నామార్చనలు నిర్వహించారు. మహిళలు సామూహిక లలితా సహస్ర నామ పారాయణ చేశారు.



యలమంచిలి: కనకదుర్గమ్మ విగ్రహం వద్ద కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



నరసాపురం రూరల్: కొప్పర్రులో అమ్మవారికి పూజలు చేస్తున్న భవానీ మాలధారులు

తక్కువ ధరలకు ధాన్యం విక్రయించవద్దు



రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

పాలకొల్లు సెంట్రల్: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని రైతులు తమ ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం పోడూరు మండలంలోని మట్టపర్రు గ్రామంలో పొలాల వద్ద ఏర్పాటు చేసిన పొలం పిలుస్తుంది వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ధాన్యం కొనుగోలు సంబంధించిన అంశాలపై అవగాహనా సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ఎవ్వరూ ఎంఎస్‌పీ కన్నా తక్కువ ధరకు అమ్మవద్దని సూచించారు. దళారులను నమ్మవద్దని ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుందని తెలిపారు. ప్రస్తుతం ఏ గ్రేడ్ రకానికి క్వింటాకు రూ. 2,389, సాధారణ రకానికి క్వింటాకు రూ. 2369 లు మద్దతు ధర ఉందన్నారు. గోనె సంచులకు ఎటువంటి కొరత లేదని రైతులు అందరికీ అవసరమైన సంచులను ప్రభుత్వమే అందిస్తుందన్నారు. ఈ పంట నమోదు కార్యక్రమాన్ని రైతులు త్వరగా పూర్తిచేసుకోవాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా డ్రోనులను సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భూసార ఆధారిత ఎరువులు వినియోగం పాటించాలని రైతులకు సూచించారు. అనంతరం బుధవారం సీఎం చంద్రబాబునాయుడు పర్యటన నేపథ్యంలో బ్రాడీపేట బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో దాశి రాజు, ఏడీఏ పి మురళీకృష్ణ, తహశీల్దార్ ఎస్‌డి మౌలానా ఫాజిల్, ఎంపీఓ విశ్వేశ్వరరావు, గ్రామ సర్పంచ్ దొమ్మేటి శ్రీను, వైస్ ఎంపిపి గుబ్బల సత్యనారాయణ, డి.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.